
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
3
మెదక్
జిల్లాల వార్తలు
బుధవారం 14 ఫిబ్రవరి 2024



మానసిక ఒత్తిడితోనే
మెడికో ఆత్మహత్య
మార్చిలో ఎంగేజ్‌మెంట్‌కు ఏర్పాట్లు.. అంతలోనే దారుణం
ఎవరిపైనా అనుమానం లేదని
స్పష్టం చేసిన కుటుంబసభ్యులు
7లో

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

- ప్రభుత్వ భూములు, జల వనరులను పరిరక్షించాలి
- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి
- మెడికల్ కాలేజీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి
- ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్య సేవలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 13: జిల్లాలో అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపాలని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టర్‌తో కలిసి అన్నిశాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. అక్రమ మైనింగ్‌పై ఇప్పటివరకు సేకరించిన వివరాలు, తీసుకున్న చర్యలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీసుశాఖలు సమన్వయంతో పనిచేసి అక్రమ మైనింగ్‌ను అరికట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఆర్డీవో సక్రమంగా వ్యవహంచడం లేదంటూ మంత్రి అసహనం వ్యక్తంచేశారు. పటాన్‌చెరు ప్రాంతం నుంచి రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్లు కంకర, ఇసుక తరలిపోతున్నా ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. అక్రమ మైనింగ్‌ను అరికట్టేందుకు మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. విలువైన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూశాఖదేనని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో ప్రభుత్వ భూములు, జలవనరులు అన్యాక్రాంతం కాకుండా అవసరమైన అన్నిచర్యలు తీసుకోవాలని నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు. అక్రమ మైనింగ్, ప్రభుత్వ భూములు, నీటి వనరుల ఆక్రమణలను అరికట్టడంపై తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని వివరించారు. ప్రభుత్వ ఆస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాలన్నారు. ఆక్రమణలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. జోగిపేట-అకోలా జాతీయ రహదారి 161పై పలుచోట్ల అండర్ పాస్‌లు లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని సూచించారు.

ప్రజా వైద్యంపై భరోసా

ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్య ఆరోగ్యశాఖ సేవలందించాలని దామోదర్ పేర్కొన్నారు. జిల్లాలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యసదుపాయాలు ఉన్నాయని, వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాలని సూచించారు. మెడికల్ కళాశాల భవనాలు త్వరితగతిన పూర్తి చేయాలని, సబ్ సెంటర్ల భవనాల నిర్మాణాలపై దృష్టి సారించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, అదనపు ఎస్పీ అశోక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లాస్థాయి సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం

క్యాంపు రాజకీయాలు

విహారయాత్రకు తరలివెళ్లిన తూప్రాన్ కౌన్సిలర్లు, జిన్నారం ఎంపీటీసీలు

తూప్రాన్, ఫిబ్రవరి 13: తూప్రాన్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసును అందజేసిన కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లారు. చైర్మన్ పదవి నుంచి బొంది రాఘవేందర్‌గౌడ్‌ను గద్దె దించేందుకు రాజకీయ పక్షాలు ఒకటయ్యాయి. అవిశ్వాసానికి మద్దతిస్తున్న కౌన్సిలర్ల సంఖ్య 11కు చేరింది. మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు మామిడి వెంకటేశ్, మామిండ్ల జ్యోతి, చెలిమెల ప్రియాంక, పల్లెర్ల జ్యోతి, జిన్న భగవాన్‌రెడ్డి, బాణపురం రాజు, చింత రవీందర్‌రెడ్డి, జమాల్‌పూర్ లక్ష్మీబాయి, నందాల శ్రీనివాస్, రామునిగారి శ్రీశైలంగౌడ్, కొడిప్యాక నారాయణగుప్తా క్యాంపునకు తరలివెళ్లారు. మెజార్టీ సభ్యుల తీర్మానంతో రెండు మూడు రోజుల్లో ప్రత్యేక సమావేశానికి నోటీసులు జారీచేసే అవకాశాలున్నాయి.

జిన్నారంలో ఎంపీపీపై..

జిన్నారం, ఫిబ్రవరి 13: జిన్నారం మండల ఎంపీపీ రవీందర్‌గౌడ్ (కాంగ్రెస్)పై అవిశ్వాసం ప్రవేశ పెట్టడానికి సిద్ధమైన బీఆర్ఎస్ ఎంపీటీసీలు క్యాంపునకు తరలివెళ్లారు. ఈ నెల 26న అవిశ్వాసంపై ఓటింగ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో నల్గొండలో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ సభకు ఎంపీటీసీలు వెంకటేశంగౌడ్, గంగు రమేష్, భార్గవ్, స్వాతి ప్రభాకర్‌రెడ్డి, సంతోష అక్కడి నుంచి క్యాంపునకు తరలివెళ్లారు.

ఎన్నికల వేళ.. బదిలీల కలవరం

- సంగారెడ్డి జిల్లా అధికార యంత్రాంగంలో కుదుపు
- కాంగ్రెస్ నేతల సిఫారులతోనే పోలీసు పోస్టింగ్‌లు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 13: జిల్లాస్థాయి అధికారుల మూకుమ్మడి బదిలీలు అధికార యంత్రాంగంలో కలవరం సృష్టించాయి. త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రభుత్వం ఈ బదిలీలను చేపట్టినట్టు తెలుస్తున్నది. ఎన్నికల నిర్వహణలో ప్రత్యక్ష సంబంధాలు లేకపోయినా పలువురు అధికారులను బదిలీలు చేయడం అధికార, ఉద్యోగ వర్గాలలో చర్చనీయాంశమైంది. ఎన్నికల నిర్వహణ అంతా రెవెన్యూ అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఉంటుంది. మండల పరిషత్ అధికారులు ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారులుగా రెవెన్యూ అధికారులకు సహకరిస్తారు. అయినా, జిల్లాలో 20 మందికి పైగా ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీల చేశారు. అనంతరం 24 గంటల్లోనే జిల్లా రెవెన్యూ అధికారి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు రాధాబాయి, మహిపాల్‌రెడ్డిని బదిలీ చేశారు. ఆ వెంటనే జిల్లా పరిషత్ సీఈవో ఎలయ్య, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, డీఆర్డీవోలోని ఏపీడీలను, సంగారెడ్డి, నారాయణఖేడ్, బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేశారు. ఇలా జిల్లాలో కీలకమైన శాఖల్లో పనిచేస్తున్న అధికారులందరినీ బదిలీ చేయడం అధికార, ఉద్యోగ వర్గాలలో కలకలం రేపుతున్నది.

పోలీస్ అధికారుల బదిలీల్లో కాంగ్రెస్ మార్క్

జిల్లాలో జరిగిన పోలీసు అధికారుల బదిలీల్లో కాంగ్రెస్ నేతల జోక్యం స్పష్టంగా కనిపిస్తున్నది. జిల్లా అదనపు ఎస్పీ పి.అశోక్ బదిలీలో కాంగ్రెస్ నేతల ప్రమేయం లేకున్నా.. డీఎస్పీలు, సీఐల బదిలీలు మాత్రం వారి సిఫారుల మేరకే జరిగినట్టు తెలుస్తున్నది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో అక్కడి కాంగ్రెస్ నేతల ప్రమేయంతోనే పోలీసు అధికారులకు పోస్టింగ్‌లు దక్కినట్టు తెలుస్తున్నది. ఇందులో లక్షలాది రూపాయలు చేతులు మారినట్టు ప్రచారం జరుగుతున్నది.

ఒక పోస్టు కోసం ముగ్గురి సిఫారసు

జిల్లాలో కీలకమైన ఒక ప్రాంతం పోలీసు అధికారికి పోస్టింగ్ ఇప్పించేందుకు జిల్లాకు చెందిన మంత్రి, రాష్ట్రస్థాయి ముఖ్య నేత, కీలక పోలీసు అధికారి వేర్వేరు వ్యక్తులను సిఫారసు చేసినట్టు తెలిసింది. చివరకు రాష్ట్రస్థాయి ముఖ్య నేత సిఫారసు చేసిన పోలీసు అధికారికి ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చినట్టు సమాచారం. సదరు అధికారి



పోస్టింగ్ వ్యవహారం రాజకీయ, పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నందునే..

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించినట్టు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు పోలీసు అధికారులను బదిలీ చేసినట్టు తెలిసింది. పలువురు డీఎస్పీలు, సీఐలు గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులైన మంత్రులు, ఎమ్మెల్యేలు డబ్బులు పంచుతున్నా పట్టించుకోలేదనే విమర్శలు కాంగ్రెస్ వర్గాల నుంచి వ్యక్తమయ్యాయి. కొందరు అధికారులైతే వారి వాహనాల్లోనే బీఆర్ఎస్ నేతల డబ్బులను తరలించినట్టు ఆరోపణలు ఎదుర్కొన్నారు. అప్పట్లో తాము ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని పలువురు కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలు పట్టుబట్టి సదరు అధికారులను బదిలీ చేయించినట్టు చెప్పుకుంటున్నారు. మొత్తం మీద తాజా బదిలీలతో జిల్లా అధికారుల్లో చాలామంది కొత్తవారు రానున్నారు.

మున్సిపల్ కమిషనర్ల బదిలీలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లాలో పలువురు మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ పురపాలకశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ సుజాతను హైదరాబాద్ పురపాలకశాఖ కార్యాలయానికి బదిలీ చేయగా, ఆమె స్థానంలో ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్‌ను నియమించారు. నారాయణఖేడ్ మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డిని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌ను నియమించారు. బొల్లారం మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డిని తెల్లాపూర్‌కు, అమీన్‌పూర్ మున్సిపల్ మేనేజర్ పి.మోహన్‌ను జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు.

ఇద్దరు అదనపు ఎస్పీలు..

సంగారెడ్డి క్రైం: సంగారెడ్డి జిల్లాలో ఇద్దరు అదనపు ఎస్పీలు బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లా శిక్షణా కేంద్రంలో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న బి.రాములునాయక్ నల్గొండ అడిషనల్ ఎస్పీగా బదిలీ అయ్యారు. సంగారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా పనిచేస్తున్న పి.అశోక్ రాచకొండ అడిషనల్ డీసీపీగా బదిలీ అయ్యారు.

అలాగే పలువురు డీఎస్పీలను బదిలీ చేశారు. సంగారెడ్డి డీఎస్పీ జె.రమేష్‌కుమార్.. హైదరాబాద్ సీఎస్‌డబ్ల్యూ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీఐడీ డీఎస్పీ ఎ.సత్తయ్య సంగారెడ్డికి బదిలీ అయ్యారు. డీసీఆర్బీ డీఎస్పీగా పనిచేస్తున్న ఎ.బాలాజీ సిద్దిపేట జిల్లా గజ్వేల్ ఏసీపీగా బదిలీ అయ్యారు. జహీరాబాద్ డీఎస్పీ వి.రఘును ఏసీబీ డీఎస్పీగా నియమించారు. ఏసీబీ డీఎస్పీగా ఉన్న కె.శ్రీనివాస్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీఎస్పీగా ఉన్న కె.రామ్మోహన్‌రెడ్డిని జహీరాబాద్ డీఎస్పీగా నియమించారు. జిల్లా శిక్షణా కేంద్రం డీఎస్పీ పి.రవీందర్‌రెడ్డిని పటాన్‌చెరు డీఎస్పీగా, పటాన్‌చెరులో పనిచేస్తున్న కె.పురుషోత్తంరెడ్డిని మల్కాజ్‌గిరి ఏసీబీగా నియమించారు.

కొత్త ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 13: మెదక్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్ వికారాబాద్ జిల్లాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా డీఆర్డీవో శ్రీనివాస్‌రావు మెదక్ జిల్లాకు వచ్చారు. అలాగే, జిల్లాకు కొత్తగా వచ్చిన ఎంపీడీవోలకు మంగళవారం కలెక్టర్ రాజర్షిషా పోస్టింగులు ఇచ్చారు. మెదక్ ఎంపీడీవోగా రఘు, నర్సాపూర్ ఎంపీడీవోగా మధులత, రామాయంపేట ఎంపీడీవోగా షాజీలుద్దీన్, మనోహరాబాద్, తూప్రాన్ ఎంపీడీవోగా వెంకటేశ్వర్‌రెడ్డి, చేగుంట, నార్సింగి ఎంపీడీవోగా చిన్నారెడ్డి, వెల్దుర్తి ఎంపీడీవోగా రామోదర్, నిజాంపేట ఎంపీడీవోగా రాజిరెడ్డి, కౌడిపల్లి ఎంపీడీవోగా శ్రీనివాస్, శివ్వంపేట ఎంపీడీవోగా నాగేశ్వర్, చిలప్‌చెడ్ ఎంపీడీవోగా ఆనంద్, హవేళీఘణపూర్ ఎంపీడీవోగా రవీశ్వర్‌గౌడ్, పాపన్నపేట ఎంపీడీవోగా సుబ్రహ్మణ్యం, కొల్చారం ఎంపీడీవోగా కృష్ణమూర్తికి పోస్టింగ్‌లు ఇచ్చారు. అలాగే, తూప్రాన్ డీఎస్పీ వి.యాదగిరిరెడ్డిని బదిలీ చేస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అయనను డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో రాచకొండ సైబర్ క్రైమ్ ఏసీపీగా పనిచేస్తున్న సోమ వెంకట్‌రెడ్డిని తూప్రాన్ డీఎస్పీగా నియమించారు.

బ్యాంకు లింకేజీలో మెదక్ జిల్లాకు రాష్ట్రంలోనే ప్రథమస్థానం

గ్రామీణాభివృద్ధి సంస్థకు కలెక్టర్ రాజర్షిషా ప్రశంసలు

7లో

డబ్బులు ఎక్కడికి పోతాయి.. పనులు చేయండి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి
- మెడికల్ కాలేజీ భవన పనుల పరిశీలన
- పనులు నెమ్మదించడంపై అసంతృప్తి
- మాదీ డాక్టర్స్ ఫ్యామిలీనే : మెడికోలతో కలెక్టర్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 13: మెడికల్ కాలేజీ భవనాల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల మెయిన్‌బ్లాక్, హాస్టల్ భవనాలను పరిశీలించారు. పనులు నెమ్మదిగా జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పటి లోగా పూర్తిచేస్తారని ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు విడుదల కాలేదని వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ 'డబ్బులు ఎక్కడికి పోతాయి.. ఎప్పటికైనా వస్తాయి కదా.. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన భవనాల నిర్మాణాలను పూర్తిచేయండి' అని ఆదేశించారు. నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు అడ్డంకిగా ఉన్న కార్మికుల షెడ్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్‌లో కొత్త ఏసీల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ రవీందర్‌రెడ్డిని ఆదేశించారు. అంతకుముందు కలెక్టర్ ఎంసీహెచ్‌తో పాటు జీజీహెచ్‌లోని ప్రతీ విభాగాన్ని సందర్శించి రోగులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, స్కానింగ్, రోగ నిర్ధారణ పరీక్షలపై ఆరా తీశారు. డయాలసిస్ కేంద్రం వద్ద ఆర్వో ప్లాంటు నుంచి నీటి లీకేజీలపై అసహనం వ్యక్తం చేశారు. సదరం క్యాంపును పరిశీలించారు. రోగుల సహాయకుల కోసం షెడ్డును, ఆసుపత్రి ప్రాంగణం చుట్టూ ప్రహరీని నిర్మించాలని ఆదేశించారు.



మెడికల్ కాలేజీ భవనాల నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్

మెడికోలతో మాటామంతి


సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు. 'మాదీ డాక్టర్స్ ఫ్యామిలీనే.. మా నాన్న గ్యాస్ట్రోఎంట్రాలజీ ప్రొఫెసర్‌గా, సూపరింటెండెంట్‌గా కర్నూలు ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. అమ్మ పాథాలజీ అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సోదరి కూడా పాథాలజీ డాక్టర్. వైద్యులకు సమాజంలో చాలా గౌరవం ఉంటుంది. వైద్య విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకుని రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి' అని పేర్కొన్నారు. ఆమె వెంట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్, ఆర్ఎంవో డా.వీరాంజనేయులు, డీఐవో డా.శశాంక్, టీఎస్ఎంఎస్ఐడీసీ రవీందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ రామ్‌బాబు, జేఈ శశాంక్, తహసీల్దార్ షేక్‌పర్వీన్, ఏఈలు వెంకటేశ్, శివ, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ఫ్యాక్టరీలో పేలుడు.. అగ్ని ప్రమాదం

- పది మందికి తీవ్ర గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం
- మరో ఇద్దరి ఆచూకీ గల్లంతు
- పక్క పరిశ్రమకు వ్యాపించిన మంటలు
- పాశమైలారం పారిశ్రామికవాడలో ఘటన

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 13 : పాశమైలారం పారిశ్రామికవాడలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా పేలుడు సంభవించి, అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పది మంది కార్మికులు తీవ్రంగా గాయపడగా, మరో ఇద్దరు కార్మికులు ఆచూకీ లభ్యం కాకపోవడంతో సహాయకచర్యలు కొనసాగుతున్నాయి. స్థానికులు, కార్మికుల అందించిన సమాచారం ప్రకారం.. సీఎంహెచ్ కెమికల్ పరిశ్రమలో మంగళవారం పేలుడు సంభవించి మంటలు భారీ స్థాయిలో ఎగిసి పడటంతో సంఘటన స్థలంలో పనిచేస్తున్న పది మంది కార్మికులు గాయపడ్డారు. ఇందులో నలుగురు కార్మికుల తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు కార్మికుల ఆచూకీ లభ్యం కాకపోవడం స్థానికంగా తీవ్ర ఆందోళన నెలకొంది. బాధితుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. కెమికల్ పరిశ్రమలో ఎగసిపడిన మంటలు పక్క పరిశ్రమకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న పటాన్‌చెరు ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేస్తూ, మంటల తీవ్రత దృష్ట్యా పలు ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్‌లను రప్పించి మంటలను అదుపు చేస్తున్నారు. గాయపడ్డ వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం హుటాహుటిన సంఘటన స్థలానికి రక్షణ చర్యలు చేపట్టి పరిస్థితి సమీక్షిస్తున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో మంటలు అదుపులోకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ప్రమాదంలో దగ్ధమవుతున్న ఫ్యాక్టరీ



మా నాన్నకు న్యాయం చేయండి సార్!

'ఆంధ్రజ్యోతి' కథనాన్ని 'ఎక్స్'లో సీఎం, డిప్యూటీ సీఎంలకు ట్యాగ్ చేసిన చిన్నారి

జోగిపేట, ఫిబ్రవరి 13 : దశాబ్దాలుగా అరకొర జీతంతో పని చేస్తున్న తన తండ్రికి న్యాయం చేయాలని ఓ చిన్నారి 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాన్ని సీఎం, డిప్యూటీ సీఎం, ట్రాన్స్‌కో సీఎండీలకు 'ఎక్స్'లో ట్యాగ్ చేసి వేడుకుంది. ఈ నెల 12న 'ఆంధ్రజ్యోతి'లో 'వెలుగులకు నో స్కోర్' పేరిట స్కోర్ సంస్థ నుంచి ట్రాన్స్‌కోలో విలీనమై 30 ఏళ్లుగా వేతన పెంపు, ఉద్యోగ భద్రతకు నోచుకోని కార్మికులపై కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. బాధితుల్లో ఒకడైనా కార్మికుడు గాడిల శేషయనారెడ్డి కుమార్తె జ్యోతి ఈ కథనాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేసి సీఎం, డిప్యూటీ సీఎం, ట్రాన్స్‌కో సీఎండీలను ట్యాగ్ చేసింది. '30 సంవత్సరాలుగా మా నాన్నతో పాటు మరికొందరు ఒకే సంస్థలో రెండో శ్రేణి ఉద్యోగుల్లా పనిచేస్తున్నారు. వీరికి న్యాయం చేయాలని కోర్టు.. ఇందన శాఖ కార్యదర్శిని ఆదేశించినా గత ప్రభుత్వంలో నాయ్యం జరగలేదు. వారి ఉద్యోగం వెట్టిచాకిరీగానే మిగిలింది. దయచేసి మా నాన్నతో పాటు స్కోర్ ఉద్యోగులను క్రమబద్ధీకరించండి సార్' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌అలీని వేడుకుంది. చిన్నారి పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

'ఎక్స్'లో జ్యోతిరెడ్డి చేసిన ట్వీట్


నడిరోడ్డుపై చదును చేయకుండా వదిలేసిన మట్టికుప్ప

నడిరోడ్డుపై ప్రమాదకరంగా మట్టికుప్ప

చేర్యాల, ఫిబ్రవరి 13: పనుల్లో జాప్యం వాహనదారులకు ఇబ్బందిగా మారింది. కొమురవెల్లి శివారులోని నూతన పోలీస్‌స్టేషన్ భవన సమీపంలో ప్రధాన రహదారిపై ఇటీవల ఏర్పడిన గోతి పూడ్చివేసేందుకు మంగళవారం మట్టి, మొరం పోసినా చదును చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. సమీపంలోని ఓ ప్రైవేటు భవనం నుంచి ప్రవహిస్తున్న మురుగు నీటి కారణంగా రోడ్డు దెబ్బతినడంతో పాటు వాహనాల రాకపోకలతో చిత్తడిగా మారి మల్లన్న భక్తులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో గుంత పూడ్చివేతకు మొరం మట్టిని రోడ్డుపై కుప్పగా పోశారు. చదును చేయడం విస్మరించారు. మట్టి కుప్ప చీకట్లో కనిపించక ప్రమాదాలకు ఆస్కారం ఉన్నందున సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సికింద్రాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

గజ్వేల్, ఫిబ్రవరి 13: సికింద్రాబాద్‌లో జరుగుతున్న ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల జాతీయస్థాయి సమావేశానికి సిద్దిపేట జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఎస్ఎఫ్ జిల్లా బృందం మంగళవారం తరలివెళ్లింది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ముంద్రాతి కృష్ణ మాట్లాడుతూ సికింద్రాబాద్‌లో మందకృష్ణ, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ వర్గీకరణపై చర్చించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట నాయకులు పెర్క పరశురాములు, సామ్రాట్ ప్రకాశ్, ముక్కపల్లి రాజు, బింగి పవన్ కళ్యాణ్, చేబర్తి మహేశ్, శ్రీహరి సింధు, ఉబ్బని అంజనేయులు, శంకర్, జితేందర్, శనిగిరి రమేశ్, కొక్కొండ నర్సింహులు, మినుముల కరుణాకర్, పెరిక ప్రశాంత్, డాకని రాజు తదితరులున్నారు.

ముందస్తు టీకాలతో వ్యాధుల నివారణ

పశు సంవర్ధకశాఖ ఏడీ రమేశ్‌బాబు


నబినగర్‌లో టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏడీ రమేశ్‌బాబు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 13: జీవాలకు ప్రభుత్వం అందించే ఉచిత టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రమేశ్‌బాబు సూచించారు. జగదేవ్‌పూర్ మదిర గ్రామమైన నబినగర్‌లో మంగళవారం మేకలు, గొర్రెలకు షిప్‌ఫాక్స్ (తల్లివ్యాధి నివారణ) టీకాల కార్యక్రమాన్ని ఏడీ, మండల పశువైద్యాధికారిని శ్వేతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలను పెంపొందించుకునే ప్రతీ రైతు ముందస్తుగా టీకాలు వేసుకోవడం వల్ల చాలా వరకు వ్యాధులను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 24 వరకు కొనసాగుతుందని తెలిపారు. మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు, నబినగర్ గ్రామంలో సుమారు 1,141 గొర్రెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, ఓఎస్ హరిప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 13 : ఈ నెల 15వ తేదీన హుస్నాబాద్ పట్టణంలో నిర్వహించే సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల మహా భోగ్ బండార్ కార్యక్రమ పోస్టర్‌ను మంగళవారం బంజారాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరవుతున్నారని, నియోజకవర్గంలోని బంజారాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బీలునాయక్, గిరిజన సంఘాల నాయకులు ధరావత్ తిరుపతి నాయక్, భిక్షపతినాయక్, సోమ్లు నాయక్, భాస్కర్ నాయక్, రాజు నాయక్, రూప్‌సింగ్, రాంబాబు నాయక్, మోతీలాల్ నాయక్, బిక్యా నాయక్, సత్యంనాయక్, శంకర్ నాయక్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భూంపల్లి విద్యార్థి

క్రీడాకారుడికి ఆర్థిక సహాయం

మిరుదొడ్డి, ఫిబ్రవరి 13: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన బొమ్మనమైన రమేష్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అండర్ 16 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ షాట్‌పుట్ పోటీలకు ఎంపికైన రమేష్‌ను మంగళవారం రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అభినందించడంతో పాటు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ నెల 16న గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్టు తెలిపారు. రమేష్‌ను పాఠశాల పీఈటీ వెంకట్‌రెడ్డి, నాయకులు నరేష్, ప్రభాకర్ అభినందించారు.

బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలోనే ప్రథమస్థానం

● గ్రామీణాభివృద్ధి సంస్థకు కలెక్టర్ ప్రశంసలు

మెదక్, ఫిబ్రవరి 13: గామీణాభివృద్ధి సంస్థ బ్యాంకు లింకేజీలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం జిల్లాకే గర్వకారణమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రశంసించారు. మంగళవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2023 త్రైమాసికానికి సంబంధించి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ వంద శాతం లక్ష్యం సాధించి, రాష్ట్రంలో ప్రథమస్థానం రావడం జిల్లాకు గర్వకారణమన్నారు. పట్టణాభివృద్ధి సంస్థ కూడా వందశాతం లక్ష్యం సాధించినట్లు తెలిపారు. మొత్తం రుణ ప్రణాళికలో వ్యవసాయ, వ్యాపార, ముద్ర, వీధి వ్యాపారుల ఉపాధికి రుణాలు పంపిణీ చేశామని వివరించారు. మొత్తం రుణ ప్రణాళికలో రూ. 3796.28 కోట్ల లక్ష్యానికి గానూ రూ.2874.32 కోట్ల లక్ష్యానికి చేరుకుని రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించామన్నారు. 2024-25 సంవత్సరానికి నాబార్డు బ్యాంకు సౌజన్యంతో రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ బోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, మెప్మా పీడీ ఇందిర, జిల్లా అధికారులు విజయ లక్ష్మి లీడ్ బ్యాంకు మేనేజర్ రెహ్మాన్, నాబార్డు డీడీఎం సెసిల్ తిమోతి, ఎస్‌బీఐ ఆర్ఎం. అరుణ జ్యోతి, ఏపీజీవీబీ రీజినల్ ఉదయ్ కిరణ్, పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల సమక్షంలో మాక్ పోలింగ్

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిబంధనల మేరకు ఎఫ్ఎల్‌సీ నిర్వహించినట్లు వివరించారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ఓట్లు మాక్ పోలింగులో వేసిన ఓట్ల లెక్కలు సరిపోలాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎలక్షన్ సూపరింటెండెంట్ హర్దీప్‌సింగ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

లిక్కర్ స్కాంలో మహిళా లోకానికి మచ్చగా ఎమ్మెల్సీ కవిత

● మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్దపీట
● పార్లమెంట్ ఎన్నికల్లో అంకిత భావంతో పని చేద్దాం
● రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 13 : లిక్కర్ స్కాంలో దేశ వ్యాప్తంగా కల్లోలం సృష్టించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళా లోకానికే మచ్చగా నిలిచిందని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు ఆరోపించారు. సంగారెడ్డిలోని సిటీ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా కార్యకర్తల సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సునితారావు మాట్లాడుతూ గడిచిన పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ మహిళలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. ఆ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మహిళలపై అరాచకాలు, అఘాయిత్యాలు పెరిగి పోయాయన్నారు. బంగారు తెలంగాణ సాధిస్తామన్న కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అవినీతి, అక్రమాలు పెరిగాయన్నారు. అన్ని వర్గాలను మోసగించిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడారన్నారు. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ పెద్దపీట వేసిందన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా మహిళలను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. మాజీ మంత్రులు సబితారెడ్డి, సునితారెడ్డి, సత్యవతి రాథోడ్‌లకు రాజకీయ బిక్ష పెట్టింది కాంగ్రెస్సేనన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేకపోయాయన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఇందు కోసం అన్ని మండలాలు, గ్రామాల్లో కమిటీలు వేసి మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం కోసం కష్టపడే వారిని అధిష్ఠానం గుర్తించి పదవుల్లో ప్రాధాన్యతనిస్తుందన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్, అందోల్ నియోజకవర్గాల్లో మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రూపు రాజకీయాలకతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సునితారావు సూచించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి, పీసీసీ కార్యదర్శి తోపాజి అనంత కిషన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు

మానసిక ఒత్తిడితోనే మెడికో ఆత్మహత్య

● మార్చిలో ఎంగేజ్‌మెంట్‌కు ఏర్పాట్లు.. అంతలోనే దారుణం
● ఎవరిపైనా అనుమానం లేదని స్పష్టం చేసిన కుటుంబసభ్యులు

పటాన్‌చెరు, ఫిబ్రవరి, 13: సంచలనం రేకెత్తించిన పీజీ మెడికో రచనారెడ్డి ఆత్మహత్యకు మానసిక ఒత్తిడే ప్రధాన కారణమని తేలింది. సోమవారం అమీన్‌పూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామ శివారులో ఔటర్ రింగ్ రోడ్డుపై ఆగి ఉన్న కారులో ప్రాణాంతక ఇంజక్షన్ అధిక మోతాదులో తీసుకుని రచనారెడ్డి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎంతో భవిష్యత్తు ఉన్న ఒక మెడికో ఈ తరహాలో ఆత్మహత్యకు పాల్పడటం ప్రతి ఒక్కరినీ కలచివేసింది. ఆమె ఆత్మహత్యకు గల కారణాలపై ఇంకా పోలీసులు ఒక నిర్ధారణకు రాలేకపోతున్నారు. కుటుంబ సభ్యులు సైతం రచనకు ఎవరితోను విబేధాలు లేవని, ఎవరిపైనా అనుమానాలు లేవని తేల్చిచెప్పడంతో ఆత్మహత్య మిస్టరీగా మిగిలిపోయింది. పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రి వద్ద రచనారెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు పోస్టుమార్టం తరువాత ఆమె మృతదేహాన్ని అంత్యక్రియల కోసం రామచంద్రాపురం తరలించారు. లభ్యమైన ప్రాథమిక ఆధారాలు, కుటుంబ సభ్యుల వాంగ్మూలం నమోదు చేసుకున్న తరువాత కేవలం ఒత్తిడి మూలంగానే ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. బాచుపల్లి మమత వైద్య కళాశాలలో పీజీ గైనకాలజీ ఇంటర్న్‌షిప్ చేస్తోన్న రచనారెడ్డికి ఇటీవలే ఓ అబ్బాయితో పెద్దలు వివాహం కుదిర్చారు. మార్చిలో ఎంగేజ్‌మెంట్‌కు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎంగేజ్‌మెంట్ షాపింగ్, పెళ్లి ఈవెంట్లపై రచన చురుగ్గా వ్యవహరిస్తూ నిత్యం సంతోషంగా కనిపించేదని, అంతలోనే ఘోరం జరిగిపోయిందని తల్లిదండ్రులు, సోదరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చదువులో ఎంతో చురుగ్గా ఉండే రచన చిన్నప్పటి నుంచి ధైర్యంగా ఉండేదని చెబుతున్నారు. పెళ్ళి నిశ్చయమైన యువకుడితో ఏమైనా మనస్పర్థలు వచ్చాయా అన్న కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఆత్మహత్యకు ముందు ఫోన్‌సంభాషణలు విశ్లేషిస్తూ, ఎవరెవరిని కలిసింది. స్నేహితులు, సన్నిహితుల నుంచి వివరాలను సేకరిస్తున్నారు. ఆత్మహత్యకు అరగంట ముందు కూడా సంతోషంగా ఉందని చెబుతున్నారు. కాగా ప్రాణాంతక ఇంజక్షన్ ఎక్కడ, ఎప్పుడు కొనుగోలు చేసింది అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు ముందే ప్లాన్ చేసుకుందన్న అనుమానాలు బలపడుతున్నాయి.

మల్లన్నరైల్వేహాల్ట్‌స్టేషన్ భూమిపూజ స్థల పరిశీలన

చేర్యాల, ఫిబ్రవరి 13 : కొమురవెల్లి గ్రామ శివారులోని రైల్వేగేట్ సమీపంలో రైల్వే హాల్ట్‌స్టేషన్ ఏర్పాటుకు ఈ నెల 15వ తేదీన భూమిపూజ చేయనున్న క్రమంలో మంగళవారం రైల్వే ఎస్పీ అనూప్‌కుమార్ శుక్లా స్థల పరిశీలన చేశారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి సీఎం మోహన్‌యాదవ్ హాజరుకానున్న నేపథ్యంలో ఆయన రైల్వేశాఖ ఉన్నతాధికారులతో పాటు హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, కొమురవెల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణ, చేర్యాల సీఐ శ్రీను తదితరులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. బందోబస్తు చర్యలు, వాహన పార్కింగ్, ఇతరత్రా ఏర్పాట్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు.కాగా అంతకుముందు సిద్దిపేట జిల్లా బీజేపీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి కొమురవెల్లిలో విలేకరులతో మాట్లా డారు. భూమిపూజ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐనాపూర్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు.

మల్లన్నసన్నిధిలో డివిజన్ అధికారి నీలిమ

చేర్యాల, ఫిబ్రవరి 13 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయాన్ని దక్షిణమధ్య రైల్వే డివిజన్ అధికారి నీలిమ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా మల్లన్నను దర్శించుకుని అభిషేకం జరిపి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్ స్వామి వారి ప్రసాదం అందించి ఆశీర్వదించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొమురవెల్లిలో రైల్వేహాల్ట్‌స్టేషన్ ఏర్పాటుతో మల్లన్న భక్తుల కోరిక నెరవేరబోతుందని, ఈనెల15న భూమిపూజ ఏర్పాట్ల పరిశీలనకు వచ్చామని తెలిపారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు రైల్వేశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే అంతకుముందు కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తదితరులు మల్లన్న ఆలయాన్ని సందర్శించారు.



మల్లన్న ఆలయ ఆవరణలో మాట్లాడుతున్న దక్షిణమధ్యరైల్వే డివిజన్ అధికారి నీలిమ

సాగు చేసిన వారికే రైతు భరోసా

● జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13: సాగు చేసిన వారికే రైతు భరోసా వర్తిస్తుందని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. మంగళవారం చిన్నశంకరంపేట, జంగరాయి, చందంపేట గ్రామాల పీఏసీఎస్ కార్యాలయాలను సందర్శించి రైతులు పండించే పంటల ప్రక్రియ నమోదుపై సొసైటీ సీఈవోలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 2లక్షల 6వేల 921 ఎకరాల వరి, 2297 మొక్కజొన్న, 267 ఎకరాల్లో శనగ, 88 ఎకరాలు వేరుశనగ, 81 ఎకరాలు మినుము, 701 ఎకరాలు తెల్లజొన్న, 10 ఎకరాలు పెసలు. మొత్తం పంటల సాగు 2లక్షల 73,371 ఎకరాలు అని తెలిపారు. రైతు పండించిన ప్రతి పంట సాగును ఏఈవోలు ఆన్‌లైన్లో పొందుపరుస్తారన్నారు. పంటలు సాగు చేయని రైతులు, బీడు భూములకు రైతు భరోసా నిధులు ఇవ్వడం లేదన్నారు. వరి సాగు చేసే రైతులు ఎకరాకు ఒక యూరియా బస్తాను మూడు సార్లు వేయాలన్నారు. పంటల సంరక్షణతో పాటు దిగుబడులు పొందేందుకు రైతులు ఏఈవోల సలహాలు పాటించాలన్నారు. రైతుల కోసం 24 వేల మెట్రిక్ టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. పంటల సాగుబడిపై సొసైటీ సీఈవోలతో పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం చిన్నశంకరంపేట, గవ్వలపల్లి గ్రామాల్లోని ఆగ్రోస్ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రతి ఫర్టిలైజర్‌షాపులో రైతులు కొనుగోలు చేసిన క్రిమిసంహారక మందులు, ఎరువు బస్తాలను ఆన్‌లైన్లో పొందుపరిచి, రసీదు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుని, కేసులు నమోదు చేస్తామని దుకాణదారులకు హెచ్చరించారు. ఆయన వెంట ఏవో ప్రవీణ్ ఉన్నారు.



చిన్నశంకరంపేటలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

కొత్త వంగడాలను వినియోగించాలి : డీఏవో శివప్రసాద్

నారాయణరావుపేట, ఫిబ్రవరి 13: పొద్దుతిరుగుడు సాగులో నూతన వంగడాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. మంగళవారం నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఎఫ్‌పీవో, భారతీయ నూనెగింజల పరిశోధన సంస్థ అధ్వర్యంలో పొద్దుతిరుగుడు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. భూమిని సారవంతం చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు వాడాలని సూచించారు. ఎక్కువ దిగుబడి సాధించి ఎఫ్‌పీవో ఆదర్శంగా నిలువాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఏఆర్ డైరెక్టర్ మాథుర్, శాస్త్రవేత్తలు సతీష్ కుమార్, రమణారావు, సురేష్ , ఎఫ్‌పీవో ఛైర్మన్ బొంగురం ఎల్లారెడ్డి, వ్యవసాయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



చేగుంట మండలం మక్కరాజ్‌పేట్ గ్రామంలో సస్యరక్షణ కేంద్ర అధికారులు



లక్ష్మీదేవిపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో శివప్రసాద్

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

చేగుంట, ఫిబ్రవరి 13: చేగుంట మండలం మక్కరాజ్‌పేట్ గ్రామంలో హైదరాబాద్ సస్యరక్షణ కేంద్ర అధికారులు మంగళవారం పర్యటించి మొక్కజొన్న పంటలను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ సస్యరక్షణ కేంద్ర అధికారి ఎం.రవిశంకర్ సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యాసంగి పంటలో ఆశించే పురుగులు తెగుళ్ళ, మొక్కజొన్న, వరి పంటలలో సమగ్ర చీడపీడల నివారణ గురించి శాస్త్రవేత్త రవిశంకర్ వివరించారు. పంటల తెగుళ్ల, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైపలలై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

రాయపోల్, ఫిబ్రవరి 13: ఉరేసుకుని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం మంతూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకున్నది. మంతూర్ గ్రామానికి చెందిన తాళ్ళ బుజ్జమ్మ(45) కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుని ఆత్యహత్యకు పాల్పడింది. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులు ఆమెను కిందికి దించగా అప్పటికే మృతిచెందింది. మృతురాలి భర్త తాళ్ళ రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.



బుజ్జమ్మ (ఫైల్)

మార్కెట్ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 13: అచ్చంపేట మార్కెట్ చైర్‌పర్సన్ అరుణపై రైతులు దాడి చేయడం అమానుషమని తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు అయిత రత్నకర్, సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాసం నవీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆమెపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తూకంలో మోసాలు జరిగితే, గిట్టుబాటు ధర లభించకపోతే చైర్‌పర్సన్‌కు, కార్యదర్శికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలి కానీ, ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం సమంజసం కాదని పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. యువకుడి అరెస్ట్

కొండపాక, ఫిబ్రవరి 13 : కొండపాక మండలం దుద్దెడ శివారులో విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గంజాయితో సంచరిస్తున్న ఓ యువకుడిని త్రీ టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. త్రీటౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దుద్దెడ శివారులో రాజీవ్ రహదారిపై అనుమానాస్పదంగా తిరుగుతున్న యువకుడు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని వెంబడించి పటుకున్నారు. విచారించగా తడబడుతూ సమాధానం చెప్పాడు. అనుమానంతో పోలీసులు పూర్తి వివరాలు సేకరించగా తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన సార్ల మహేష్ (21)అని చెప్పాడు. అతన్ని వద్ద తనిఖీ చేయగా గంజాయి లభించింది. దానిని తూకం వేయగా 24 గ్రాములుగా తేలింది. మహేష్ గంజాయికి అలవాటు పడి సిద్దిపేటలో తాను కూలి పని చేసే దగ్గర తనతో పాటు పని చేసి కూలీలకు ఎక్కువ ధరకు గంజాయి విక్రయించి డబ్బులు సంపాదించాలని మహేష్ వెల్లడించినట్టు ఎస్ఐ తెలిపారు. మహేష్ వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ వివరించారు.

'తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోండి'



ఏవో పరమేశానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సంగారెడ్డి రూరల్ ఫిబ్రవరి 13 : అక్రమంగా విధుల్లోంచి తొలగించిన మున్సిపల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. సంగారెడ్డి కలెక్టరరేట్‌లో మంగళవారం ఏవో పరమేశంకు సీఐటీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను పనిలో నుంచి తొలగించి, వారి స్థానంలో డబ్బులు తీసుకుని మున్సిపల్ అదనపు శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబు ఇతరులను నియమించారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడుతున్న విజయ్‌బాబుని సస్పెండ్ చేయని పక్షంలో ఈ నెల 16వ తేది నుంచి విధులను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రభు, కిరణ్, రమేష్‌గౌడ్, అనిల్, గణేష్, రాజు తదితరులు ఉన్నారు.

రైస్‌మిల్ వ్యాపారి ఆస్తుల వేలం

నర్సాపూర్, ఫిబ్రవరి 13: నర్సాపూర్‌కు చెందిన రైసు మిల్లు వ్యాపారి శ్రీధర్‌గుప్తా నుంచి జప్తు చేసిన చర ఆస్తులను మంగళవారం నర్సాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ కమలాద్రి నేతృత్వంలో వేలం నిర్వహించారు. వ్యాపారి శ్రీధర్‌గుప్తా సీఎంఆర్ బియ్యానికి సంబంధించి ప్రభుత్వానికి రూ. 47కోట్ల చెల్లించాల్సి ఉండగా, అవి చెల్లించకపోవడంతో ఆయన చరస్థిర ఆస్తులను జప్తు చేయడంతో పాటు గత నెల 18వ తేదీన శ్రీధర్‌గుప్తాను అరెస్టు కూడా చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం జప్తు చేసిన రెండు కార్లు, రెండు ఏసీలు, టీవీని వేలం వేశారు.



వేలం పాటలో పెట్టిన చర ఆస్తులు

విద్యార్థుల స్వయం పాలన

చేగుంట, ఫిబ్రవరి 13: చేగుంట మండలం వడియారం ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ప్రధానోపాధ్యాయుడిగా వంజరి శ్రీరామ్, ఎంఈఓగా ఆదిత్య చరణ్‌గౌడ్, డీఈవోగా ప్రణవ్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలిగా భవ్యశ్రీ, ఉపాధ్యాయులుగా అంజలి, అనువర్షిని, జ్యోత్స్న, లక్ష్మీ ప్రసన్న, ఎం.ఇందు, మేఘన వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నవాత్ సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● మనోహరాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలిగా కావ్య, డీఈవోగా రామ్‌చరణ్, ఆర్డీడీగా లోహిత, ఎంఈవోగా భానుప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్‌గా ప్రవీణ్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కృపారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంగారెడ్డి వరకు మెట్రోను పొడిగించాలి

● అప్పటి వరకు పోరాడుతాం
● మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 13: సంగారెడ్డి వరకు మెట్రోరైలును పొడిగించాలని, అప్పటి వరకు పోరాడుతామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మెట్రో రైలు సాధన కోసం బీజేపీ ఆధ్వర్యంలో సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. మియాపూర్ వరకు ఉన్న మెట్రోను పటాన్‌చెరు వరకు పొడిగిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, అలా కాకుండా సంగారెడ్డి, సదాశివపేట వరకు పొడిగించాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే లేడని ఆ పార్టీ దుర్మార్గమైన ఆలోచన చేయవద్దన్నారు. ఎమ్మెల్యేగా జగ్గారెడ్డి ఓడిన తర్వాత నియోజకవర్గ ప్రజలను బహిష్కరించానని అనడం సరికాదని, జగ్గారెడ్డినే ప్రజలు వెలేశారనే విషయాన్ని గుర్తెరగాలన్నారు. అధికార కాంగ్రెస్‌లో ఉన్న జగ్గారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని ఒప్పించి సంగారెడ్డి వరకు మెట్రోరైలు తీసుకొస్తే గౌరవంగా ఉంటుందన్నారు. జగ్గారెడ్డి, చింతా ప్రభాకర్ ఎవరు ముందుకొచ్చినా రాకున్నా న్యాయబద్ధమైన డిమాండ్ కోసం బీజేపీ తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. దశల వారీగా పోరాటం కొనసాగిస్తామన్నారు. జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం నిధులతోనే పట్టణ, గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. మెట్రో రైలు సాధన కోసం జిల్లా వ్యాప్తంగా కలిసికట్టుగా పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరావు కులకర్ణి, మాణిక్‌రావు, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట నర్సింహ్మారెడ్డి, పులిమామిడిరాజు, మల్లికార్జున్‌పాటిల్, రాష్ట్ర నాయకులు సంగప్ప, జిల్లా అధికార ప్రతినిధి రాజుగౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి

అంత్యక్రియలకు వెళ్లిన వ్యక్తి చెరువులో పడి మృతి


కరుణాకర్(ఫైల్)

మనోహరాబాద్, ఫిబ్రవరి 82: బంధువు అంత్యక్రియలకు వెళ్లిన వ్యక్తి చెరువులో స్నానం చేస్తుండగా మునిగి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కొండాపూర్ గ్రామంలో మంగళవారం ఒకరు మృతిచెందారు. అంత్యక్రియలకు అదే గ్రామానికి చెందిన బంధువు సందగాళ్ల కరుణాకర్(25) వెళ్లాడు. అనంతరం గ్రామ చెరువులోకి స్నానానికి వెళ్లగా.. ప్రమాదవశాత్తు అందులో మునిగి మృతి చెందాడు. పోలీసులకు సమాచారం తెలపడంతో ఘటన స్థలానికి చేరుకుని, దర్యాప్తు చేపట్టారు.

మక్కరాజుపేటలో మహిళ అదృశ్యం


సంతోష (ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 13: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన చేగుంట మండలం మక్కరాజుపేట గ్రామంలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్ఐ ఆర్.బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మక్కరాజుపేట గ్రామానికి చెంది బాల్‌చెట్టి సంతోష సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కుమారుడు వేణుమాధవ్‌గౌడ్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ప్రతిభ, సామాజిక సేవలకు ఐకాన్ అవార్డుల ప్రదానం

జిన్నారం, ఫిబ్రవరి 13: సామాజిక సేవలు, వివిధ రంగాల్లో చూపిన ప్రతిభకు గుర్తింపుగా మండలానికి చెందిన ముగ్గురికి స్వామి వివేకానంద ఐకాన్ అవార్డులను అందజేశారు. మంగళవారం హైదరాబాద్ త్యాగరాయ గాన సభలో గోల్డెన్ స్టార్ యూత్ కల్చరల్ ఆధ్వర్యంలో అవార్డులు అందజేశారు. ఇందులో జిన్నారానికి చెందిన ఏర్పుల శ్రీనివాస్, మాదారానికి చెందిన అంబదాస్, సోలక్‌పల్లికి చెందిన అమూల్య రెడ్డి అవార్డులను అందుకున్నారు.

పాడు బడిన బావిలో పడిన వ్యక్తిని రక్షించిన ఫైర్ సిబ్బంది

రామాయంపేట, ఫిబ్రవరి 13: ప్రమాదవశాత్తు పాడుబడిన బావిలో పడిన వ్యక్తిని ఫైర్ సిబ్బంది రక్షించారు. మండల పరిధిలోని అక్కన్నపేట రైల్వే స్టేషన్ సమీపంలో మంగళవారం నడుచుకుంటూ వెళ్తున్న నిరంజన్ రోడ్డు పక్కనే ఉన్న బావిలో పడిపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సిబ్బంది చేరుకుని తాళ్ల సహాయంతో అతన్ని రక్షించారు. చిన్నపాటి గాయాలు కావడంతో ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుడిని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ వాసిగా గుర్తించారు.

పానాది రోడ్డు నిర్మాణంతో రైతుల్లో ఆనందం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని జి.హుక్రాన గ్రామ పేదలు, దళితులకు చెందిన అధిక వ్యవసాయ భూములు మనూరు మండలం కమలాపూర్ శివార్ వరకు ఉన్నాయి. రోడ్డు లేకపోవడంతో అనేక సంవత్సరాలుగా రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను చేల నుంచి తీసుకురావడానికి అష్టకష్టాలు పడేవారు. ఈ మార్గంలో ఉన్న పానాది గుండా రోడ్డు వేయడానికి రైతులు తమ భూముల్లో కొంత మేర ఇవ్వడానికి అంగీకారం తెలిపారు. రైతులు, గ్రామ పెద్దల కోరిక మేరకు తాజామాజీ సర్పంచ్ ఆశీర్వాదం ఇటీవలే రూ.5 లక్షల ప్రత్యేక అభివృద్ధి నిధులతో ఖేడ్-కంగ్టి పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కమలాపూర్ శివారు వరకు రోడ్డు వేయించారు. ఈ మార్గంలోనే సయ్యద్ షాదుల్లా దర్గా సైతం ఉంది. రోడ్డు సదుపాయం ఏర్పడడంతో భక్తులతో పాటు రైతులు దీర్ఘకాలికంగా నెలకొన్న తమ బాధలు తొలగాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నర్సాపూర్ ఎస్ఐగా పుష్పరాజ్

నర్సాపూర్, ఫిబ్రవరి 13: నర్సాపూర్ ఎస్ఐగా పుష్పరాజ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై, పలు సూచనలు చేశారు.

రేపటి నుంచి దౌల్తాబాద్‌లో ఉత్సవాలు


ఎమ్మెల్యే సునీతారెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

హత్నూర, ఫిబ్రవరి 13: హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో నెలకొల్పిన స్పటిక లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఈ నెల 15, 16 తేదీల్లో నిర్వహించనున్నారు. వార్షికోత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ స్థానిక నాయకులు మంగళవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌రెడ్డి, మైనంపల్లి హనుమంతరావును కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ బాధ్యులు ఆవుల రాజిరెడ్డి, బీజేపీ నాయకుడు మురళీధర్‌యాదవ్‌కు కూడా ఆహ్వాన పత్రికలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆహ్వానించిన వారిలో గ్రామ మాజీ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, దౌల్తాబాద్-2 ఎంపీటీసీ కుంటమీది వీరేశం, గ్రామ మాజీ ఉప సర్పంచ్ దుర్గంగౌడ్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు తిరుమల ఆలయ బ్రహ్మోత్సవాలు


చల్మెడలోని ఆలయంలో స్వామివారి విగ్రహం

నిజాంపేట, ఫిబ్రవరి 12: మండల పరిధిలోని చల్మెడ గ్రామ శివారులో వెలసిన తిరుమల స్వామి ఆలయంలో రథ సప్తమిని పురస్కరించుకుని గురువారం నుంచి మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. చుట్టుపక్కల సుమారు 20 గ్రామాల ప్రజలు ఉత్సవాల్లో పాల్గొంటారని ఆలయ కార్యనిర్వాహక అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. గురువారం శాంతి పాఠం, పుణ్యావాచకం, రక్షాబంధనం, అంకురార్పణ, అరగింపు, తీర్థ ప్రసాద గోష్ఠి, శుక్రవారం కల్యాణ హోమం, బండ్ల ఊరేగింపు నిర్వహిస్తామని చెప్పారు. శనివారం అభిషేకం, గరుడోత్సవం, బాలభోగం, అలంకారం, నైవేద్య సమర్పణ, హారతి, రథోత్సవం, ఆదివారం స్వామి వారి ఆరాధన, పూర్ణాహుతి, బాలభోగము, చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

బీజేపీ కల్హేర్ మండలాధ్యక్షుడిగా అనిల్‌రెడ్డి



కల్హేర్, ఫిబ్రవరి 13: బీజేపీ కల్హేర్ మండలాధ్యక్షుడిగా బీబీపేట గ్రామానికి చెందిన ఎన్నం అనిల్‌రెడ్డిని నియమిస్తూ సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బీజేవైఎం సంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా పని చేసిన అనిల్‌రెడ్డి గ్రామాల్లో పార్టీ అభివృద్ధి విశేష కృషి చేయడంతో ఈ పదవిని కట్టబెట్టారు. అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. కల్హేర్ మండలంలో బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తానన్నారు. తన ఎన్నిక కోసం కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 13 : బదిలీపై వెళ్తున్న వివిధ శాఖల అధికారులను మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరు క్రాంతి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విధులు నిర్వర్తించే సమయంలో అందించే సేవలే గుర్తింపునిస్తాయని అన్నారు. ఎక్కడ విధులు నిర్వహించినా నిజాయితీగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు సేవలందించే అవకాశం రావడం అదృష్టమన్నారు. బదిలీపై వెళ్తున్న వారిలో డీపీవో సురేష్‌మోహన్, డీఆర్డీవో శ్రీనివాస్‌రావు, రెవెన్యూ అధికారి మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులను సన్మానిస్తున్న కలెక్టర్ క్రాంతి

హెచ్‌ఐవీ రహిత సమాజ నిర్మాణానికి కృషి

● జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డానియల్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 13: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డానియల్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సానుకూల వ్యక్తుల పట్ల వివక్ష చూపడం ఎయిడ్స్ మహమ్మారి వ్యాప్తి చెందడానికి సహాయపడుతుందన్నారు. 2030 నాటికి ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అనంతరం యువతి, యువకులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు, చిత్రలేఖనం, క్విజ్ కాంపిటేషన్‌లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, ఉమ్మడి జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్‌కుమార్, అధ్యాపకులు, ఎన్‌వైకే వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


హెచ్‌ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనపై నిర్వహించిన పోటీల విజేతలతో కళాశాల అధ్యాపకులు, ఎయిడ్స్ నియంత్రణ అధికారులు

గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

● కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్

మనోహరాబాద్, ఫిబ్రవరి 13: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మనోహరాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణమూర్తి వినతిపత్రాన్ని అందజేశారు. ఆసిఫ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గత మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు వేతనాలు రాక కుటుంబ పోషణ భారమవుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులకు మాత్రం ఒకటవ తేదీన జీతాలు చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర బడ్జెట్ ఉంటుందని, వర్కర్లకు ఇవ్వడానికి బడ్జెట్ లేదా అని ఆయన మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. లేదంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో కార్మికులు స్వామి, ఎల్లమ్మ, నవనీత, శోభ ఉన్నారు.


ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారి కృష్ణమూర్తికి వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

● వారోత్సవాల్లో రామాయంపేట సీఐ వెంకటేష్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 13: రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని రామాయంపేట సీఐ వెంకటేష్ అన్నారు. మానవ తప్పిదాలతోనే అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. రోడ్డు నియమాల గురించి ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడో ఒక చోట రోడ్డు ప్రమాదం జరిగి, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు మృతిచెందుతున్నారని వెల్లడించారు. ఎక్కువ శాతం అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతీ ఒక్క వ్యక్తి ట్రాఫిక్ రూల్స్ పాటించి ఇతరులకు ఇబ్బంది కలుగకుండా చూసుకోవాలని కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ప్రతీ ఒక్కరికి పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నామని సీఐ వెల్లడించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ నారాయణగౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేష్

చెట్ల తిమ్మాయిపల్లిలో వైద్య శిబిరం


శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

మాసాయిపేట, ఫిబ్రవరి 13: మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామంలో మంగళవారం మెడిసిటీ ఆస్పత్రి మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో చెట్లతిమ్మాయిపల్లి తండాతో ఇతర గ్రామాలకు చెందిన ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. పలు రోగాలకు వైద్యుల సలహాలను పొందారు. బీపీ, షుగర్ వ్యాధులతో పాటు ఫిజియోథెరపీ, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులకు మెడిసిటీ ఆస్పత్రి బృందం ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, సంజన, ప్రవీణ్ పాల్గొన్నారు.

'గ్రామాల్లో బీజేపీ బలోపేతాని కృషి'

జహీరాబాద్, ఫిబ్రవరి 13: జహీరాబాద్ మండలంలోని గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి తనవంతు బాధ్యతగా కృషిచేస్తానని పార్టీ మండలాధ్యక్షుడు దుర్గయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన దుర్గయ్యను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పదవులు రావడంతో బాధ్యత పెరిగిందనే విషయాన్ని అందరు గమనించాలన్నారు. ప్రజలకు, బీజేపీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యకర్తలు, నాయకులు అందరం కలిసి బీజేపీ బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీని కాపాడుకుంటే పార్టీ తమను కాపాడుతుందనే విషయాన్ని అందరూ గ్రహించాలని కోరారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు కొండాపురం నర్సింహులు మాట్లాడుతూ.. సేవచేసే నాయకుడికి ప్రజల్లో ఎప్పటికీ గుర్తింపు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కృష్ణ, వెంకటేష్, శివకుమార్, మల్లేష్, హరీష్ పాల్గొన్నారు.

బిడెకన్నలో ఊరడమ్మకు బోనాలు

ఝరాసంగం, ఫిబ్రవరి 13: మండల పరిధిలోని బిడెకన్న గ్రామంలో మంగళవారం గ్రామదేవత ఊరడమ్మకు మహిళలు, గ్రామస్థులు ఘనంగా బోనాలు నివేదించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతురాజుల నృత్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలను నెత్తిన పెట్టుకుని, ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లి, భక్తి శ్రద్ధలతో అమ్మవారికి నివేదించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, చెన్నారెడ్డి, దత్తు, రాములు పాల్గొన్నారు.

● రామాయంపేట: రామాయంపేట పట్టణంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు, మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, ఆలయ చైర్మన్ పల్లె శ్రీనివాస్‌గౌడ్ అమ్మవారిని దర్శించుకున్నారు.

కుకునూర్‌లో మల్లికార్జున ఆలయ వార్షికోత్సవం

వెల్దుర్తి: మండల పరిధిలోని కుకునూర్ గ్రామంలో మంగళవారం బస్వాపూర్ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ 46వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కుకునూర్ గ్రామంలోని హన్మాన్ ఆలయం నుంచి భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం వరకు భక్తులు కాషాయపు జెండాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.


కుకునూర్ గ్రామంలో కాషాయపు జెండాలతో ర్యాలీ తీస్తున్న భక్తులు


బిడెకన్న గ్రామంలో ఊరడమ్మ బోనాల ఊరేగింపు

మగ్గంవర్క్‌లో మహిళలకు ఉచిత శిక్షణ


మహిళలకు మగ్గం వర్క్ మెటీరియల్స్‌ను పంపిణీ చేస్తున్న దృశ్యం

వెల్దుర్తి, ఫిబ్రవరి 13: వెల్దుర్తి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం మగ్గం వర్క్ శిక్షణను ఏపీఎం శంకరయ్య, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్‌తో కలిసి జడ్పీటీసీ రమేష్‌గౌడ్ ప్రారంభించారు. నాబార్డు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఉచితంగా ఇస్తున్న మగ్గం వర్క్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ రమేష్‌గౌడ్ అన్నారు. శిక్షణ పొందుతున్న సభ్యులకు ఉచితంగా మధ్యాహ్నం భోజనం, ప్రతిరోజు రూ.50 ఇవ్వనున్నట్లు నాబార్డు ప్రోగాం కో ఆర్డినేటర్ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో విఘ్నేశ్వర్, బ్యాంక్ అధికారులు వినయ్, సన, వెల్దుర్తి ఈవో బలరాంరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత



కంగ్టిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్

కంగ్టి, ఫిబ్రవరి 13: కంగ్టిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల్లో విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. తహసీల్దార్ విష్ణుసాగర్, డిప్యూటీ తహసీల్దార్ ఎండి జుబేర్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, మండల నాయకులు పవన్, కేవీపీఎస్ నాయకులు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనే లక్ష్యం

● లెప్రసీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శశాంక్‌దేశ్‌పాండే


సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 13: కుష్ఠు నిర్మూలనే లక్ష్యమని లెప్రసీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ శశాంక్‌దేశ్‌పాండే అన్నారు. సంగారెడ్డి ఐటీఐ సమీపంలోని కుష్ఠు రోగుల పునరావాస కేంద్రం(నిర్మలా క్లినిక్)లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కుష్ఠు బాధితులకు ఎంసీఆర్ చెప్పులు, దుప్పట్లు, పండ్లు, సెల్ఫ్‌కేర్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుష్ఠు నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవోలు మారుతి, ప్రతాప్‌గౌడ్, వెంకటరమణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ కరపత్రాల ఆవిష్కరణ


సంగారెడ్డిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంగారెడ్డి రూరల్ ఫిబ్రవరి 13: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను మార్చి 10వ తేదిన సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు వీరశైవ లింగాయత్ సమాజం మహిళా విభాగం అధ్యక్షురాలు మంజుల కౌలష్ తెలిపారు. సంగారెడ్డిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు సంబంధించి మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవ ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ వేడుకలకు తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన మహిళామణులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఏర్పాట్ల విషయంలో సంఘం జిల్లా కమిటీ సహకారం అందిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంది మజీ సర్పంచ్ విమల, ఎంపీడీవో అశోక్, జగదీశ్వర్, గణేష్, శ్రీశైలం పాటిల్, అన్నపూర్ణ, రాజు, వసంత, శశికళ, శోభ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలకు రూ.లక్ష విరాళం


ఉత్సవ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న శంకర్‌నాయక్

జహీరాబాద్, ఫిబ్రవరి 13: ఈ నెల 15న జహీరాబాద్ పట్టణంలో సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు తనవంతు బాధ్యతగా రూ.లక్ష విరాళంగా ఉత్సవకమిటీ సభ్యులకు బీఎస్ఎన్ఎల్ డైరెక్టర్ శంకర్‌నాయక్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్‌లో నిర్వహించే సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో గిరిజనులందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆల్‌ఇండియా బంజారాసేవాసంఘం నాయకులు మాట్లాడుతూ.. ఉత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవకమిటీ సభ్యుడు సంజీవ్, ఆల్‌ఇండియా బంజారా సేవాసంఘం నాయకులు ప్రేమ్‌సింగ్, రాంరాథోడ్, శ్రీనివాసనాయక్, వాసునాయక్, సంజుపవార్, భీంరావ్, రాజుబానోత్, రవీందర్‌చౌహాన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.